క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం

ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి



రైతులకు స్ప్రింక్లర్ సెట్లను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి

దుబ్బాక: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాయపోల్, దౌల్తాబాద్ మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అన్నారు. 3 సంవత్సరాల నుంచి స్ప్రింక్లర్లపై సబ్సిడీ లేనందున రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చొరవతో దౌల్తాబాద్, రాయపోల్ మండలాలకు 200 స్ప్రింక్లర్ సెట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామంలో 100 స్ప్రింక్లర్ సెట్లను రైతులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మలరాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, యాదవరెడ్డి, తదితరులున్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ, మెడికల్ బిల్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశాడు. శుక్రవారం పట్టణ కేంద్రంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.విజయేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొమాండ్ల రాంరెడ్డితో కలిసి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వేతనాలకు కేటాయింపు చేసినా, చట్టబద్ధంగా ఐఎఫ్‌ఎంఐఎస్ ద్వారా ప్రతినెల 1వ తేదీన చెల్లించాల్సిన వేతన, పెన్షన్ డబ్బులు చెల్లించడం లేదన్నారు. బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు పరిధిలో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేసి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): శ్రీరామనవమి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో గల రామునిబండ రామాలయంలో సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వ్రతాల్లో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తైబజార్‌కు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తైబజార్, పశువుల సంతకు శుక్రవారం వేలం పాట జరిగింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.21,51,000వేలకు సీహెచ్.కొండల్ తైబజార్‌కు వేలం పాడగా, పశువుల సంతకు రూ.14,55,000వేలకు టీ.రాజేశం వేలం పాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆర్‌ఐ శివ కుమార్, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నాట్యం కూడా ముఖ్యం



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులకు చదువుతో పాటు నాట్యం కూడా ముఖ్యమేనని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు తెలుగు శాఖ 'కూచిపూడి సర్టిఫికెట్ కోర్స్'పై 40రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నాట్యం నేర్పించిన గురువు పద్మజారాణిని అభినందించారు. అనంతరం విద్యార్థినులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యాపకురాలు డాక్టర్ అనిత, ఉమారాణి, మృణాళిని, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణానికి సర్వం సిద్ధం

- 2న నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు
- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక



ఆలయంలో పూజలు చేస్తున్న ఒగ్గుపూజారులు



కొండల మధ్య కొలువైన రేకులకుంట మల్లన్న ఆలయం

దుబ్బాక టౌన్: కోరిన భక్తులకు కోరినన్నీ వరాలిచ్చే మహిమగల దేవుడిగా రేకులకుంట మల్లికార్జునస్వామి ప్రసిద్ధి. చుట్టూ కొండల మధ్య పచ్చని చెట్లు అందమైన ప్రకృతి రమణీయత మధ్య దుబ్బాక మున్సిపల్ పరిధిలోని అడవిలో రేకులకుంట మల్లన్న ఆలయం కొలువైంది. అడవిలో గుట్టల మధ్య కొలువైన ఆలయంలో పెద్దగుండు(బండరాయి)లో ముందువైపు మల్లికార్జునస్వామి, వెనుకవైపు ఎల్లమ్మ తల్లి కొలువై ఉన్నారు. గొల్ల కురుమలు తమ ఆరాధ్య దైవంగా రేకులకుంట మల్లన్నను కొలుచుకుంటారు.

ఒగ్గు పూజారులే అర్చకులు

రేకులకుంట ఆలయంలో గొల్లకురుమల పయ్యావులు, కోటోల్లు, చెరుకూరి వంశస్తులే ఒగ్గు పూజారులుగా పూజలందిస్తున్నారు. ఆలయంలో మల్లన్న, ఎల్లమ్మకు బోనాలు, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటారు. సాంప్రదాయం ఉట్టిపడే విధంగా ఒగ్గుపూజారులు పూజలు, సగ్గ పిండితో అందమైన పట్నం పరిచి ఒగ్గు వాయిద్యాల మధ్య కనుల పండువగా పట్నాలు వేస్తారు. ఆదివారం, మంగళవారం, శనివారం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

కార్యక్రమాలు..

మేడలమ్మ, కేతమ్మ, మల్లికారునస్వామిలతో పాటు రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహామునిల కల్యాణోత్సవం ఈ నెల 2 (ఆదివారం) జరుగనుంది. ఈ సందర్భంగా తెల్లవారుజామునే దేవతామూర్తుల ఒగ్గు ప్రార్థనలతో మేలుకొలుపు, స్వామివారు, అమ్మవార్ల ఊరేగింపు, గంగబోనం తెప్పోత్సవం, అగ్ని గుండం ప్రజ్వళన, పెద్ద పట్నం వేయుట, అగ్ని గుండం ప్రవేశం, నల్లలు చేయుల కార్యక్రమాలు నిర్వహిస్తారు, 3న ఎల్లమ్మ జమదగ్ని పట్నం బోనం సమర్పణ, మంగళహారతి, మహాశీర్వచనం కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ రొట్టె రమేశ్ తెలిపారు.

అంటరానితనాన్ని నిర్మూలిద్దాం



చిన్నకోడూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న శ్రీనివాస్

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో కుల, మత భేదాలు లేకుండా ఐక్యంగా ఉండి అంటరానితనాన్ని నిర్మూలిద్దామని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చౌడారం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యంగా ఉంటేనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దరు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దళితులను చిన్నచూపు చూడొద్దని, అందరూ సమానమేననే భావన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంజీవ్, సర్పంచ్ అనితబాలయ్య, వార్డు సభ్యులు, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని దొమ్మాటలో శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొని పౌరులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వినోద, ఏఎస్ఐ నవీన్, కార్యదర్శి, ఎస్సీహాస్టల్ వార్డెన్, వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గజ్వేల్‌రూరల్: గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు ప్రతీ ఒక్కరికి అందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయశ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, ఎంపీటీసీ అశోక్, ఆర్‌ఐ కృష్ణ, మాజీ సర్పంచ్ భూమయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ




ట్రోఫీ అందుకుంటున్న కోచ్ శ్రీనివాస్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట గ్రామానికి చెందిన మహ్మద్ కరీం కరాటే బెస్ట్ కోచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ 3వ ఏషియన్ కరాటే పోటీలకు రుద్రమదేవి షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా అకాడమీ నుంచి పాల్గొన్న కరీం అంతర్జాతీయ బెస్ట్‌కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కరీంను సినీ హీరో కరాటే చైర్మన్ సుమన్ చేతుల మీదుగా సన్మానించారు.

బెజ్జంకి(సిద్దిపేట): గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో ఫునోకోశి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అ సోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జ రిగిన మూడో అంతర్జాతీమ కరాటే పోటీల్లో బె జ్జంకిలోని ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బెస్ట్ కోచ్‌గా దేవులపల్లి శ్రీనివాస్ ఎంపికయ్యారు. వీరికి సినీ హీరో సుమన్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అండర్ 10కటా విభాగం, స్పారింగ్‌లో ఎన్ జోషి, అండర్ 18 స్పారింగ్‌లో అజయ్, స్పారింగ్ అండర్ 25 విభాగంలో భాస్కర్ లు మొదటి బహుమతి గోల్డ్ మెడల్ సాధించారని, సా యికృష్ణ స్పారింగ్ అండర్ 20 విభాగంలో రెండో బహుమతి సాధించాడని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను బెజ్జంకి క్రీడాభిమానులు, యువకులు అభినందించారు.

దుబ్బాక: కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణానికి చెందిన విద్యార్థులు 4 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ బురాణి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ 12 విభాగంలో సుంకోజు అక్షయ కుమతె అండ్ కాటస్‌లో 2 గోల్డ్ మెడల్స్, ఎంగారి వర్షిని గోల్డ్, సిల్వర్ మెడల్స్, సామలేటి మనస్విని గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హీరో సుమన్ ప్రశంస పత్రాలు అందించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



కొండపాకలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాక, తిప్పారం గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ రాంరెడ్డి, సీడీపీఓ శారద, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డిలు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మల్లారాపు ఎలిజబెత్‌రాణి, విజయ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సిద్దిపేటజోన్: టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దుచేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా బయల్దేరిన కార్యకర్తలు క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రయత్నం చేయగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి లింగం, బాబు, ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పల్లెను నిర్మిద్దాం



స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ రహిత స్వచ్ఛమైన పల్లెను నిర్మిద్దామని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. అలాగే కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో, ఫంక్షన్‌లలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్త వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే చెత్త బండికి అందించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ సదానందంగౌడ్, ఎంపీఓ సోమిరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విజేతలకు అభినందన



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

సిద్దిపేటరూరల్: ఎన్‌ఎంఎంఎస్–2022 ఉపకార వేతన పరీక్షల్లో ఎంపికైన జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు చింతల అన్వేష్, గుండెల్లి స్పందన, మ్యాకల అభినయ, తాటిపల్లి భువనేశ్వర్‌రెడ్డి, ఈర్ల సౌమ్య, కారంకంటి పూజ, బురుజుకింది ప్రశాంత్, కొంపల్లి విశిష్టలకు శుక్రవారం పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు తోట మధుసూదన్ ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం హెచ్‌ఎం రాళ్లబండి పద్మయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, రాజు, రాజేందర్, లక్ష్మీనర్సయ్య, మల్లారెడ్డి, తిరుపతి, గోపీనాథ్, చెన్నకేశవులు, దయానంద్, ప్రసన్నలక్ష్మి, దుర్గయ్య, భాగ్యలక్ష్మి, కృష్ణమూర్తి, అఖిల పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో సీతారాముల కల్యాణం వేదపండితుడు రామాచార్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి సీతారాముల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల మధ్య మండపానికి తీసుకొచ్చారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

నేడు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

బెజ్జంకి(సిద్దిపేట): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలగొందుతున్న బెజ్జంకి లక్ష్మినర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా చైత్ర శుద్ధ మాసంలో వచ్చే స్వామివారి ఉత్సవాలు చైత్ర బహుల సప్తమి రోజు ముగుస్తాయి. బెజ్జంకి మండలంతో పాటు సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డిలతో పాటు మహారాష్ట్రలోని ముంబాయి, బీవండి, షోలాపూర్, కర్ణాటకలోని బల్లార్శ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డ భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ముఖ్య ఘట్టాలు నిర్వహిస్తారు. 1వ తేదీ శనివారం (చైత్ర శుద్ధ ఏకాదశి) రోజు స్వామివారి తిరుక్కల్యాణం, 6వ తేదీ గురువారం(చైత్ర శుద్ధ పౌర్ణమి) శకటోత్సవ వేడుకలు (గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట), ముఖ్యమైన జాతర 8వ తేదీ శనివారం (చైత్ర శుద్ధ పాడ్యమి) తెల్లవారుజామున రథోత్సవం నిర్వహిస్తారు. బ్రహోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారుల సమన్వయంతో విజయవంతంగా ఉత్సవాలు నిర్వహించాలని సమావేశం నిర్వహించారు. కరీంనగర్, సిద్దిపేట ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్‌లను ప్రత్యేకంగా నడపనున్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలు అందజేత



అవార్డు అందుకుంటున్న బంజేరుపల్లి సర్పంచ్ శంకర్, తదితరులు



అవార్డు అందుకుంటున్న ఇర్కోడ్ సర్పంచ్ వినీత, తదితరులు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ భాగ్య



అవార్డు అందుకుంటున్న ఇబ్రహీంపూర్ సర్పంచ్ దేవయ్య, తదితరులు

సిద్దిపేటరూరల్: 2021–22 సంవత్సరానికి సంబంధించి జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్, బంజేరుపల్లి, రూరల్ మండలంలోని ఇర్కోడ్ గ్రామాలకు శుక్రవారం హైదరాబాద్‌లోని సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మల్లారెడ్డిలు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, డీపీఓ దేవకీదేవి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీఎ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు జీవన్‌రెడ్డి, శ్వేత పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన ఎర్రవల్లి గ్రామం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికకావడంతో శుక్రవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ భాగ్య భిక్షపతి అవార్డును అందుకున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ భాగ్యభిక్షపతి, కార్యదర్శి వికాస్‌రెడ్డి మంత్రి కేటీఆర్, దయాకర్ రావు, మల్లారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీపీఓ దేవకీదేవి, ఎంపీఓ రాజలింగం, మర్కూక్ సర్పంచ్ భాస్కర్, అంగడికిష్టాపూర్ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్‌లు పాల్గొన్నారు.

సమాజ బాధ్యతను గుర్తించేందుకు దోహదం



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్

కొండపాక(గజ్వేల్): సమాజ బాధ్యతను గుర్తుచేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం దోహదపడుతుందని త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ, రాంపల్లి గ్రామాల్లో సిద్దిపేట డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 4, యూనిట్ 7లను సందర్శించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల బాధలు, ప్రభుత్వ పనితీరులు ఎలా ఉంటున్నాయన్న విషయాలపై అవగాహనతో పాటు సమాజిక బాధ్యతను నేర్పేలా ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణ నేర్పుతుందన్నారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజల స్థితిగతులు, ప్రభుత్వ పథకాల తీరులపై సర్వే చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హుస్సేన్, ప్రోగ్రాం ఆఫీసర్లు పల్లవి, రాణి, రిటైర్డు లెక్చరర్ హరినాథశర్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గజ్వేల్ మండలం బూర్గుపల్లి సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణలలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో వారం రోజులుగా చేపడుతున్న శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ చంద్రంగౌడ్, కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, అధ్యాపకులు డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కవిత, మార్కండేయ, లావణ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



జనార్ధన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం


సిద్దిపేటకమాన్: సిద్దిపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జరిగిన ఎన్నికల్లో న్యాయవాదులు ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేశం, ఉపాధ్యక్షురాలు అరుణ, జాయింట్ సెక్రటరీ కృష్ణమోహన్, కోశాధికారి అశోక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్, స్వామి, రామకృష్ణలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి హరిహరరావు, శివాజీగణేశ్ తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సాయిబాబ, బాపురావు, రాజలింగం, వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గజ్వేల్ అధ్యక్షుడిగా హరికృష్ణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరికృష్ణ నియామకమైనట్లు ఎన్నికల అధికారి వీ.భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో బార్ అసోసియేసన్ ఎన్నికలు నిర్వహించారు. ఖాజా మిస్కిన్‌పై 11 ఓట్ల మెజార్టీతో ఏ.హరికృష్ణ అధ్యక్షుడిగా ఎన్నికవగా, ఉపాధ్యక్షుడిగా బీ.రాజు, ప్రధాన కార్యదర్శిగా నర్సింహచారి, సంయుక్త కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా నరేశ్‌చారి, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా కనకయ్య, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, గఫార్‌లు ఏకగ్రీవంగా నియామకమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు కష్టపడి చదవి మంచి ఫలితాలు సాధించాలని కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 253మంది పది విద్యార్థులకు, సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని చింతమడక ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులకు, 99 మంది ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర పరీక్ష సామగ్రిని అందించారు.

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని ఎల్లంపల్లెకు చెందిన బొనగిరి రూపేశ్‌ను దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శిగా శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగిన మహాసభలో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. బాధ్యతలను అప్పగించినందుకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్, గడప మల్లేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షతపై పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

◆ నిధుల మంజూరుపై హర్షం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ కింద జగదేవ్‌పూర్ మండలానికి రూ.87 లక్షల నిధులు మంజూరు అయ్యాయని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. సీడీఎఫ్ నిధులతో మండలంలోని 29 గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

◆ సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయండి

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత రైతు సంఘం, సీఐటీయూ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 5వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన కార్మిక, కర్షక, సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిదిలోని ముస్త్యాలలో సంఘర్షణ ర్యాలీని విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రవీందర్, కిషన్, భాస్కర్, సిద్దయ్య, బాలయ్య, లలిత, పద్మ, కిష్టవ్వ, స్వరూప పాల్గొన్నారు.

◆ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెర్క పరశురాములు అన్నారు. ఎస్సీ వర్గీకరణ సంగ్రామ పాదయాత్ర కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభమై శుక్రవారం సిద్దిపేట పట్టణానికి చేరుకోగానే పెర్క పరశురాములు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ నెల 4న హైదరాబాద్ ముట్టడి ఉంటుందని, ఈ ముట్టడికి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలన్నారు. అనంతరం యాత్ర హైదరాబాద్‌కు బయలుదేరింది.

◆ 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

హుస్నాబాద్: ఏప్రిల్ 3, 4వ తేదీల్లో బీసీ సమస్యలపై నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేసేందుకు బీసీలు తరలిరావాలన్నారు.